వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 289
పేజీలు : 08 | వెల: రూ.5/-
మంగళవారం
ఆగస్టు 26, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




8లో..

## పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించాలి

శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ డాక్టర్ కడియం కావ్య



వివరాలు 2లో..

# ప్రకృతి ప్రేమే.. వినాయక పూజ

- మట్టితోనే మనుగడ
- ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో పర్యావరణానికి ముప్పు
- ప్రమాదకర రంగులతో నీటి కాలుష్యం
- ఊరూవాడా గణనాథుల సందడి

వినాయక చవితి వచ్చేసింది. ఊరూవాడా గణనాథుల సందడి నెలకొంది. నవరాత్రులు ఆధ్యాత్మిక వైభవాన్ని చాటుతాయి. మండపాల్లో ఎంత పెద్ద విగ్రహం ఏర్పాటు చేస్తే అంత భక్తి అన్నట్లు సాగుతోంది. పోటీ పడి విగ్రహాల ఎత్తును పెంచుతూ తమ ఆడంబరాలను ప్రదర్శిస్తున్నారు. గల్లి గల్లీలో విగ్రహాలను ఏర్పాటు చేసి తమ భక్తి భావాన్ని చాటుకుంటున్నారు. అయితే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వాడకంతో పర్యావరణానికి ముప్పుఅని గ్రహించిన పర్యావరణ ప్రేమికులు, సామాజిక కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థలు మట్టి విగ్రహాలను పూజించాలంటూ ప్రచారం చేస్తున్నారు. అందుకు అనుగుణంగా పలువురు ఉచితంగానే మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తూ తమ ఔదార్యాన్ని ప్రదర్శిస్తున్నారు. గ్రేటర్ వరంగల్ పాలకులు సైతం ఒక్కో డివిజన్ కు వెయ్యి మట్టి విగ్రహాలను పంపిణీ చేసేందుకు శ్రీకారం చుట్టారు. భారతీయ సాంప్రదాయాలు, పండగలన్నీ ప్రకృతితో ముడిపడి ఉన్న విషయాన్ని వివరిస్తున్నారు. వేదకాలం నుంచే పంచభూతాలైన భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశాన్ని ఆరాధిస్తున్న విషయాన్ని గుర్తు చేస్తున్నారు. మట్టితో చేసిన గణపతులను పూజించడం, పూలూపత్రి పెట్టడం, అవన్నీ చెరువులో వేయడం వెనక ప్రకృతి పరమార్థం దాగివుందంటున్నారు. ప్రకృతిని ప్రేమిస్తూ గణనాథుడికి పూజ చేసుకోవడం పుణ్యప్రదం.. మోక్ష దాయకం అంటున్నారు.

- వరంగల్ వాయిస్, దామెర



వినాయక చవితి శుభాకాంక్షలు



8లో..

## భూభారతి దరఖాస్తులకు పరిష్కారం చూపాలి

- హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్
- శాయంపేట తహసీల్దార్ కార్యాలయంలో పరిష్కార ప్రక్రియ పరిశీలన



8లో..

## చైన్ స్నాచర్ అరెస్ట్

వివరాలు తెలిపిన సీపీ సన్ ప్రీత్ సింగ్

## డిగ్రీ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ



పాఠకులకు, ప్రకటన కర్తలకు, వ్యాపార,వాణిజ్యవేత్తలకు, అధికారులకు, నాయకులకు, ప్రజా ప్రతినిధులకు, మహిళామణులకు ప్రతి ఒక్కరికి వినాయక చవితి శుభాకాంక్షలు.. పండుగ సందర్భంగా బుధవారం కార్యాలయానికి సెలవు. పున: దర్శనం గురువారం.

- వరంగల్ వాయిస్ యాజమాన్యం

# ప్రకృతి ప్రేమే.. వినాయక పూజ



- మట్టితోనే మనుగడ
- ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో పర్యావరణానికి ముప్పు
- ప్రమాదకర రంగులతో నీటి కాలుష్యం
- ఊరూవాడా గణనాథుల సందడి

**వరంగల్ వాయిస్, దామెర :** ప్రతి సంవత్సరం భాద్రపద శుద్ధ చతుర్థి రోజు మనం వినాయకచవితి పండుగని జరుపుకుంటాము. గణపతిని పూజించకుండా ఎలాంటి శుభ కార్యమూ తలపెట్టం. ఎందుకంటే, ఆయన కృపాకటాక్షాలతో సకల కార్యాలు నిర్విఘ్నంగా నెరవేరుతాయని శాస్త్రవచనం. వినాయకుడు విఘ్నాలను తొలగిస్తాడు కనుక ఆయనకే తొలిపూజ చేయడ ఆచారంగా వస్తోంది. విఘ్నేశ్వరుడు ప్రమథగణాలకు అధిపతి గనుక గణపతి అంటారు. అనేక పేర్లతో అలరారుతున్న గణనాథుడికి ప్రపంచ వ్యాప్తంగా పూజలు నిర్వహించడం హైందవ సంప్రదాయంలో భాగంగా మారింది. వినాయకుడికి ఎన్నో నామాలు ఉన్నట్లే, ఎన్నో రూపాలు కూడా ఉన్నాయి.

### ప్రకృతితో ముడిపడిన పండుగ..

భారతీయ సాంప్రదాయాలు, పండగలు అన్నీ ప్రకృతితో ముడిపడి ఉన్నవే. ప్రకృతిని, పంచభూతాలను ఆరాధించడం వేదకాలం నుంచే ఉంది. మట్టితో గణపతులను చేయడం, పూలూపత్రి పెట్టడం, అవన్నీ చెరువులో వేయడం వెనక ప్రకృతి పరమార్థం దాగివుంది. వినాయకచవితి పర్వదినాన మనం అనేక పుష్పాలు, ఫలాలతో గణనాథుడిని పూజిస్తాం. వినాయక పూజలో ఉపయోగించే పత్రిలో విశేష ఔషధ గుణాలు ఉన్నాయి. గోరంత పత్రి పెడితే చాలు కొండంత వరాలు గుప్పిస్తాడు. అందుకే వినాయక పూజ అంటే అందరికీ ఇష్టం. వారిని ప్రోత్సహించడం ద్వారా ప్రకృతికి పాటుపడేలా చేయాలి. ఉండ్రాళ్ల నైవేద్యానికే మహదానందపడిపోతాడు విఘ్నేశ్వరుడు.

### పత్రిపూజ ఎందుకు చేస్తాం?

వినాయకుడికే పత్రిపూజ ఎందుకు చేస్తామంటే ఆయన గజముఖుడు. ఏనుగుకు ఇష్టమైనవి ఆకులే కదా! అందుకే ఈ పత్రి పూజ. ఏకవింశతి.. అంటే ఇరవై ఒక్క రకాల పత్రితో గణేశుడిని పూజిస్తాం. గజాననుడని కీర్తించినా, మూషిక వాహనుడని మొక్కినా, సర్వవిఘ్నాలకు అధినాయకుడని శిరస్సు వంచినా తొలిపూజలు దక్కేదతనికే. అందుకే భాద్రపద శుక్ల చవితి రోజున భక్తి శ్రద్ధలతో వినాయక పూజ చేసుకోవడం పుణ్యప్రదం.. మోక్ష దాయకం!

### ఎన్నో ప్రత్యేకతలు..

అయితే ప్రకృతిని ఆరాధిస్తున్న మనం.. దాని విధ్వంసాన్ని పట్టించుకోవడం లేదు. ప్రకృతి పరిరక్షణ చర్యలను పెద్దగా గుర్తించడం లేదు. దీనినుంచి బయటపడే మార్గాలను ఆలోచించాలి. విఘ్నాలను నివారించే వినాయకుని పూజతో మనం పండగను



జరుపుకొంటాం. గణపతి అంటే ప్రకృతి ప్రియుడు. ఆయనకు మనం చేసే పూజ అంతా ప్రకృతి ఆరాధన కిందకే వస్తుంది. చెరువుల్లో మట్టిని తవ్వి తీసుకుని వచ్చి వినాయకుడిగా చేసి, మళ్లీ చెరువలోనే పూజించిన పత్రీపూలతో నిమజ్జనం చేయడం వెనక శాస్త్రీయత ఉంది. మట్టిని తీసి మళ్లీ అది ఎరువుగా మారుతుంది.  చెరువు నీరు కాలుష్య రహితంగా కావడానికి జరిగే ప్రక్రియ ఇందులో ఇమిడి ఉంది. మనం పూజించే మారేడు, ఉత్తరేణి వంటివి ఔషధ గుణాలు కలిగి ఉండడం వల్ల నీటిని కాలుష్యం నుంచి కాపాడుతాయి. అందుకే వినాయకచవితి ఎన్నో ప్రత్యేకతలు కలిగిన పర్వదినంగా చూడాలి. ఏటా కొన్ని వేల గణపతి విగ్రహాలను రంగులతో అలంకరించి మండపాల్లో ఏర్పాటుచేయడాన్ని చూస్తుంటాం. అలాగే ప్రతి ఇంట్లో వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజ నిర్వహిస్తాం. ఇవన్నీ ప్రకృతికి దగ్గరగా ఉండేలా చూడాలి.

### ప్రకృతిపై స్నేహభావం..

వినాయకచవితి పర్వదినంలో మనం అనేక పుష్పాలు, ఫలాలతో స్వామిని పూజిస్తాం. మనం పూజ చేసే పత్రి నేత్ర, మూత్ర, చర్మ సంబంధమైన రోగాలతోపాటు మరికొన్ని ఇతర వ్యాధులకు మంచి మందుగా పనిచేస్తుంది. అంతేకాక ఆ పత్రి నుంచి వెలువడే సుగంధాన్ని పీల్చడం వల్ల కూడా స్వస్థత చేకూరుతుంది. పత్రిని మనం చేత్తో ముట్టుకోవడం వల్ల అందులో ఉండే వృక్ష సంబంధ రసాయన పదార్థాలు కావలసిన మోతాదులో చర్మం ద్వారా మన శరీరంలోకి శోషణం చెంది ఆరోగ్యాన్ని చేకూరుస్తాయి. తొమ్మిది రోజుల తర్వాత వినాయకుణ్ణి బావుల్లో, నదుల్లో, చెరువుల్లో నిమజ్జనం చేస్తారు. తొమ్మిది రోజుల పూజ తర్వాత విగ్రహంతో పాటు 21 పత్రాలను కూడా నీళ్లలో వదిలేస్తాం. ఇవి ఇరవైమూడు గంటలయ్యాక తమలో ఉన్న ఔషధగుణాలైన ఆల్కలాయిడ్స్‌ని నీళ్లలోకి వదిలేస్తాయి. దాని వల్ల నీటిలో ఉండే బాక్టీరియా నిర్మూలన జరిగి నీళ్లల్లో ఆక్సిజన్ శాతం పెరుగుతుంది. వినాయక పూజ వల్ల మనకు విఘ్నాలు తొలగి అనుకున్న పనులన్నీ చక్కగా జరుగుతాయి. పిల్లలకు పత్రి సేకరణ వల్ల వృక్ష విజ్ఞానంతో పాటు వినోదం, పర్యావరణం పట్ల స్నేహభావం కలుగుతుంది.



### మట్టి వినాయకులనే పూజిద్దాం..

ఏటా కొన్ని వేల గణపతి విగ్రహాలను రంగులతో అలంకరించి మండపాల్లో ఏర్పాటు చేస్తున్నాం. అలాగే ప్రతి ఇంటిలో వినాయక విగ్రహాన్ని ప్రతిష్టించి పూజ నిర్వహిస్తాం. వీటిని మట్టితో తయారుచేస్తేనే మన పర్యావరణం కాపాడకున్నవారం అవుతాం. కొంతకాలంగా  విగ్రహాల తయారీలో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, రసాయనాలు కలిగిన రంగులను ఎక్కువగా వినియోగిస్తున్నారు. వినాయక నిమజ్జనంతో ఈ రంగులు, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చెరువులు, కుంటలు, తటాకాలు, బావులు, నదులకు పర్యావరణ నష్టం జరుగుతోంది. ఈ జలాల్లో నివసించే అనేక జీవకోటి మనుగడకు విఘాతం ఏర్పడుతోంది. అలాగే నీరు కలుషితం అవుతోంది. అందుకే ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను వాడాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. ఇంటిలో పూజించే చిన్న చిన్న వినాయక విగ్రహాలను పూర్తిగా మట్టితో తయారుచేస్తే అవి పర్యావరణహితంగా ఉంటాయి. నీటిలో సులభంగా కరిగిపోతాయి. విషపూరిత రంగులను వాడకపోవడంతో నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉండదు. వీధుల్లో ప్రతిష్టించే పెద్ద విగ్రహాల తయారీలోనూ మట్టినీ, పర్యావరణ హితమైన రంగుల్నీ వాడటం ద్వారా పర్యావరణానికి మేలు చేయొచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ఇటువంటి విగ్రహాల వల్ల నిమజ్జన సమయంలో జలాలు కలుషితం కావని చెబుతున్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ స్వచ్ఛమైన ప్రకృతి కోసం కొన్ని జాగ్రత్తలు పాటించాల్సి ఉంది. పెద్ద పెద్ద చెరువులూ, తటాకాలూ, కుంటల్లో వినాయకుడి విగ్రహాలను నిమజ్జనం చేసి పర్యావరణాన్ని దెబ్బతీయకుండా చేస్తే అంతకు మించిన పర్యావరణపరిరక్షణ మరోటి ఉండదు.

# మట్టి వినాయకులను పూజిద్దాం..

- పర్యావరణాన్ని రక్షించుకుందాం
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

**వరంగల్ వాయిస్, క్రైం :** పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి గణపతులను పూజించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సిబ్బందికి సూచించారు. వినాయక చవితి పండుగ సందర్భంగా మట్టితో చేసిన గణపతి విగ్రహాలను సీపీ చేతుల మీదుగా సిబ్బందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషన్ మాట్లాడుతూ రసాయనాలతో తయారుచేసిన గణేష్ విగ్రహాల ద్వారా వాతావరణం కాలుష్యం అవడంతోపాటు ఆరోగ్య సమస్యలు కూడా తలెత్తే అవకాశం ఉందన్నారు. రాబోవు తరాలకు స్వచ్ఛమైన వాతావరణం అందించేందుకుగాను ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను ఏర్పాటు చేసి పూజలు చేద్దామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా



సిబ్బందికి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, అదనపు డీసీపీ ప్రభాకర్ రావుతో పాటు ఏసీపీలు జితేందర్ రెడ్డి, వెంకటేష్, నాగయ్య, సురేంద్ర, ఆర్ఐలు సతీష్ ,శ్రీధర్, స్వర్జన్ రాజు, ఆర్ఎస్ఐ శ్రవణ్ తో పాటు పరిపాలన విభాగం సిబ్బంది, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ వద్దు.. మట్టి గణపతే ముద్దు

- సత్యం గ్రూప్స్ చైర్మన్ గంట రవికుమార్

**వరంగల్ వాయిస్, రంగశాయిపేట :** ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ వద్దు.. మట్టి గణపతే ముద్దు అని సత్యం గ్రూప్స్ చైర్మన్ గంట రవికుమార్ అన్నారు. వరంగల్ నగరం రంగశాయిపేటలోని లిటిల్ ఫ్లవర్స్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు షేర్ల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గంట రవికుమార్ హాజరై విద్యార్థులకు గణపతులను పంపిణీ చేశారు. మట్టి విగ్రహాలను పూజిస్తే పర్యావరణానికి ఎంతో శ్రేయస్కరం అన్నారు. అలాగే సహజ సిద్ధంగా ప్రకృతిలో దొరికే ముడిసరుకుతో చేసే వినాయక ప్రతిమలనే పూజించాలని హైంధవ పురాణాలు కూడా చెబుతున్నాయన్నారు. మట్టికి మనిషికి విడదీయరాని బంధమని, ఒక్కమాటలో చెప్పాలంటే మానవ



మనుగడ ప్రకృతితో ముడిపడి వుందన్నారు. గతంలో కంటే ప్రస్తుతం కొంత మార్పు వచ్చిందన్నారు. వినాయక చవితి సందర్భంగా ఇళ్లల్లో మట్టితో చేసిన విగ్రహాలనే పూజిస్తున్నారన్నారు. మట్టితో తయారు చేసే విగ్రహాలకు మంచి డిమాండ్ ఉందన్నారు. అయితే వీధుల్లో, గ్రామాల్లో ఏర్పాటు చేసే భారీ గణపయ్యలను కూడా మట్టితో చేసే విగ్రహాలనే ఏర్పాటు చేసేలా ప్రభుత్వం ప్రోత్సహించాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారన్నారు.

# దివ్యాంగుడి దయనీయ స్థితి

◆ ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు
◆ రూ. 25వేల ఆర్థిక సాయం చేసిన దాస్యం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని జులైవాడకు చెందిన నడిపల్లి శ్రీధర్ రావు చిన్నతనంలోనే పోలియో వ్యాధితో కాళ్లు పడిపోయాయి. అయినా సరే ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకుండా డిగ్రీ వరకు చదువుకున్నారు. విద్యావంతుడైన శ్రీధర్ రావు దివ్యాంగుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్నారు. అయితే, ఇటీవల శ్రీధర్ ఆరోగ్యం మరింత క్షీణించింది. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తడంతో పాటు, కైఫోస్కోలియోసిస్ (వెన్నెముక వంకరపోవడం) అనే ఆరోగ్య సమస్య కూడా వచ్చింది. దీంతో శ్రీధర్ రావును హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. శ్రీధర్ రావుది నిరుపేద కుటుంబం కావడంతో చికిత్సకు అయ్యే ఖర్చును భరించలేని స్థితిలో ఉన్నారు. వైద్యుల ప్రకారం, చికిత్సకు సుమారు రూ. 15 లక్షలు అవసరం. ఈ నేపథ్యంలో, శ్రీధర్ రావు సోదరుడు శ్రీకాంత్ దాతల సహాయం కోసం విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ రూ. 25 వేల ఆర్థిక సహాయం అందించారు. మరిన్ని నిధులు సేకరించడానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. సాయం అందించాలనుకునే వారు. ఈ వెబ్‌సైట్ ద్వారా నేరుగా తోచినంత సాయం చేయవచ్చని బాధితుడి సోదరుడు శ్రీకాంత్ కోరారు. ఇతర వివరాల కోసం శ్రీధర్ రావు సోదరుడు శ్రీకాంత్ ఫోన్‌నంబర్ 8686867779, శ్రీధర్ రావు ఫోన్ నంబర్ 9014915226లలో సంప్రదించవచ్చు.

## ఘనంగా మదర్ థెరీసా జయంతి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, మదర్ థెరీసా జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ "మదర్ థెరీసా తన జీవితాన్ని సేవకే అంకితం చేసిన గొప్ప వ్యక్తి. పేదలు, అనాథలు, రోగులు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ ఆమె తల్లిలా తోడుగా నిలిచి మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు. ఆమె చూపిన సేవా మార్గంలో మనం కూడా నడుస్తూ సమాజానికి అండగా ఉండాలి. ఆమె ఆలోచనలు మనందరికీ స్ఫూర్తినిస్తాయి," అని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తాచాటాలి

**వరంగల్ వాయిస్, నడికూడ :** పరకాల మాజీ శాసనసభ్యుడు చల్లా ధర్మారెడ్డి ఆదేశాల మేరకు నడికూడ మండల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో నరసక్కపల్లి, నడికూడ గ్రామాలలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దురిశెట్టి చంద్రమౌళి (చందు) మాట్లాడుతూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ఏ ఒక్కటీ పూర్తిగా అమలు చేయలేదని ఆయన విమర్శించారు. అంతేకాకుండా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన అభివృద్ధి పనులను కూడా పూర్తి చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలం గడుపుతోందని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులను ప్రతి ఒక్కరూ నిలదీయాలని చంద్రమౌళి బీఆర్ఎస్ శ్రేణులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మేడిపల్లి శోభన్, సమన్వయ కమిటీ సభ్యులు నందికొండ జైపాల్ రెడ్డి, మచ్చ రవీందర్, తిప్పర్తి సాంబశివ రెడ్డి, మండల యూత్ నాయకులు ముస్కె రాము, గుడికందుల శివ, ఆయా గ్రామ కమిటీల అధ్యక్షులు తాళ్లపెల్లి రమేష్, రావుల కిషన్, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు, యూత్ నాయకులు, స్థానిక కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## 'జై హనుమాన్ స్ట్రీట్' కాలనీ బోర్డు ప్రారంభం



**వరంగల్ వాయిస్, న్యూ శాయంపేట:** నగరంలోని 31వ డివిజన్, న్యూ శాయంపేట గ్రామంలో బస్ స్టాండ్ సమీపంలోని ఒక కాలనీకి 'జై హనుమాన్ స్ట్రీట్'గా నామకరణం చేసి, నూతన కాలనీ బోర్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ మామిండ్ల రాజు ముఖ్య అతిథిగా హాజరై, రిబ్బన్ కట్ చేసి కాలనీ బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మామిండ్ల రాజు మాట్లాడుతూ.. కాలనీకి కొత్తగా పేరు పెట్టడం చాలా సంతోషంగా ఉందని, కాలనీ వాసులందరూ కులమత భేదాలు లేకుండా ఉమ్మడి కుటుంబంలా కలిసిమెలిసి ఉండాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సహకారంతో కాలనీలోని రహదారులు, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి, వీలైనంత వరకు అన్ని వీధుల్లోనూ కొత్తగా సీసీ రోడ్లు, డ్రైనేజీలను నిర్మించామని తెలిపారు. కాలనీకి సంబంధించిన సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే వెంటనే వాటిని పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం కాలనీవాసులు కార్పొరేటర్ మామిండ్ల రాజును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొల్లూరి కోటేశ్వర్, రాదండి అశోక్, న్యాల చేరాలు, జంపాల శ్రీనివాస్, చిన్నాల అజయ్, తోట శంకర్, లక్కాకుల రాజేష్, లక్కాకుల గోపి, సాంబరాజు రాజ్‌కుమార్, వేముల నాగరాజు, రాదండి శ్రీనివాస్, నాశబోయిన మహేందర్, వెల్దండి అశోక్, వీరన్న, నాలం సాంబయ్య, చిన్నాల వంశీ, అజ్మీర భాస్కర్, వెల్దండ కిరణ్, దేవర అశోక్, నేల ఉదయ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం

### నోటీసులు ఇచ్చిన పంచాయతీ కార్యదర్శి



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని లాదెళ్ల గ్రామంలో ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఇల్లు నిర్మించుకుని నివసిస్తున్న ఒక వ్యక్తికి గ్రామ పంచాయతీ కార్యదర్శి నోటీసులు జారీ చేశారు. గ్రామానికి చెందిన భీమారపు రాజయ్య (తండ్రి కనకయ్య) పల్లె ప్రకృతి వనం పక్కన ఉన్న ప్రభుత్వ స్థలంలో అక్రమంగా గృహ నిర్మాణం చేపట్టి నివాసం ఉంటున్నాడు. అంతేకాకుండా, గ్రామ పంచాయతీ స్ట్రీట్ లైన్ నుంచి విద్యుత్ తీగలను తగిలించుకుని దొంగతనంగా విద్యుత్తును, అలాగే నర్సరీ నీటిని వాడుకుంటున్నట్లు గ్రామ పంచాయతీ అధికారులు గుర్తించారు. ఈ అక్రమాలపై గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజయ్యకు నోటీసులు ఇచ్చారు. నోటీసు అందుకున్న మూడు రోజులలోగా ఇంటిని ఖాళీ చేయాలని, లేనిపక్షంలో పంచాయతీరాజ్ చట్టం 2018 ప్రకారం అక్రమ గృహ నిర్మాణం, విద్యుత్, నీటి చౌర్యం కింద చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# పంటలకు తెగుళ్లు.. శాస్త్రవేత్తల సలహాలు

**వరంగల్ వాయిస్, నడికూడ:** తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, వరంగల్ శాస్త్రవేత్తల బృందం మంగళవారం నడికూడ మండలం కంఠాత్మకూరు గ్రామంలో పత్తి, వరి, పసుపు పంటలను పరిశీలించింది. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రైతులకు పలు సూచనలు చేశారు. పత్తి పంటలో రసం పీల్చే పురుగుల నివారణకు వేప నూనె (1500 పీపీఎం) లీటరు చొప్పున లేదా అసిఫేట్ 300 గ్రాముల చొప్పున ఎకరానికి పిచికారీ చేయాలని సీనియర్ శాస్త్రవేత్త, కోఆర్డినేటర్ డాక్టర్ ఏ.విజయ భాస్కర్ సూచించారు. ఆలస్యంగా విత్తిన పత్తిలో 1:20 నిష్పత్తిలో ఫ్లూనికామైడ్ మందును నీటిలో కలిపి లేత కాండానికి పూయాలన్నారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు, ఆకు మాడు తెగుళ్లను గుర్తించిన శాస్త్రవేత్తలు.. కత్తెర పురుగు నివారణకు ఎమమెక్టిన్ బెంజోయేట్ మందును ఎకరాకు 80 గ్రాముల చొప్పున మొక్క మధ్యలో పడేలా పిచికారీ చేయాలని సూచించారు. ఆకు మాడు తెగులు నివారణకు ప్రాపికోనజోల్ మందును ఎకరానికి 200 మిల్లీలీటర్ల చొప్పున పిచికారీ చేయాలన్నారు. ఆలస్యంగా వరి సాగు చేసే రైతులు స్వల్పకాలిక రకాలను ఎంచుకోవాలని సూచించారు. కలుపు యాజమాన్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. గడ్డి జాతి కలుపు మొక్కల నివారణకు 'ఫినాక్సి ప్రాప్ ఈథైల్' (రైస్ స్టార్) మందును ఎకరానికి 350 మిల్లీలీటర్ల చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వెడల్పాటి ఆకు కలుపు, తుంగ నిర్మూలనకు 'ట్రై ఫోమో ఈత్ ఆక్సీ సల్ఫురాన్' (కౌన్సిల్ ఆక్టివ్) మందును ఎకరానికి 90 గ్రాముల చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పసుపు పంటలో అధిక వర్షాల వల్ల దుంప కుళ్ళు, దుంప పుచ్చు ఆశించే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు తెలిపారు. దుంప కుళ్ళు నివారణకు మొక్క మొదట్లో నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మెటల్ ఆక్సిల్, మాంకోజెబ్ కలిసిన మందును 2.5 గ్రాములు లీటరు నీటికి కలిపి మొదలు తడిచేలా పిచికారీ చేయాలన్నారు. దుంప పుచ్చు రాకుండా దుంప ఈగ నివారణకు కార్బో ఫ్యూరాన్ 3 సీజీ గుళికలను ఎకరానికి 8 నుంచి 10 కిలోలు ఇసుకలో కలిపి పొలమంతా చల్లుకోవాలని సూచించారు. అలాగే, పొటాష్ లోపం నివారణకు (13-0-45) 5 గ్రాములు లీటరు నీటికి కలిపి ఆకులపై పిచికారీ చేసుకోవాలన్నారు. ఈ బృందంలో శాస్త్రవేత్తలు డాక్టర్ రాజ్ కుమార్, డాక్టర్ ఆర్.విశ్వతేజ, మండల వ్యవసాయ అధికారి పోరిక.జై సింగ్, ఏఈవో గోపీనాథ్, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.



## తెలంగాణ ఉద్యమకారుల హామీలను నెరవేర్చాలి



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (టీయూఎఫ్) ఆధ్వర్యంలో ఒక సమావేశం జరిగింది. శాయంపేట టౌన్ అధ్యక్షుడు రంగు మహేందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పొడిశెట్టి గణేష్, జిల్లా ఉపాధ్యక్షుడు గిద్దెమారి సురేష్, జిల్లా యూత్ అధ్యక్షుడు కొమ్ముల శివ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023 కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలైన 250 గజాల ఇంటి స్థలం, రూ. 25,000 గౌరవ వేతనం, ఉచిత బస్సు, రైలు సౌకర్యాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉద్యమకారులు పోస్ట్ కార్డుల ద్వారా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి లేఖలు రాశారు. తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని, లేనిపక్షంలో ఉద్యమకారుల చేతిలో ఘోర పరాభవం తప్పదని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీయూఎఫ్ నాయకులు ఎండీ రఫీ, వనం దేవరాజు, సామల భిక్షపతి, మారేపల్లి సదానందం, బాసాని నవీన్, తుమ్మ ప్రభాకర్, కానుగుల నాగరాజు, ఎండీ రాజు మహ్మద్, చిందం ప్రభాకర్, కొడపాక బాబు, జోగి రెడ్డి శంకర్ రెడ్డి, కోలా ఆనందం తదితరులు పాల్గొన్నారు.

# తక్కళ్లపల్లి శ్రీనివాసరావుకు సన్మానం



**వరంగల్ వాయిస్, వరంగల్:** సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా రెండవసారి ఎన్నికైన తక్కళ్లపల్లి శ్రీనివాసరావును సీపీఐ వరంగల్ జిల్లా నాయకులు మంగళవారం ఘనంగా సత్కరించారు. మేడ్చల్ జిల్లాలో ఈ నెల 20 నుంచి 22 వరకు జరిగిన సీపీఐ రాష్ట్ర నాలుగవ మహాసభలలో తక్కళ్లపల్లి శ్రీనివాసరావు తిరిగి రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో, వరంగల్ శివనగర్‌లోని సీపీఐ జిల్లా కార్యాలయం తమ్మెర భవన్‌లో జిల్లా కార్యదర్శి ఎస్.కె.బాష్ మియా ఆధ్వర్యంలో శ్రీనివాసరావును పూల బోకే, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు లక్ష్మణ్, బుస్సా రవీందర్, గుండె బద్రి, నాయకులు ల్యాదెళ్ల శరత్, ఓర్సు రాజు, ఎండీ అక్బర్, జన్ను రవి, పరికిరాల రమేష్, లావుడ్యా దస్రూ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో భారీగా చేరికలు



**వరంగల్ వాయిస్, పరకాల:** కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై సంగెం మండలం కుంటపల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగళవారం హనుమకొండలోని భవాని నగర్‌లో ఉన్న తన నివాసంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మటి సాంబయ్య సమక్షంలో ఈ చేరికలు జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూకాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై ప్రజలు స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారని అన్నారు. కొత్తగా పార్టీలో చేరిన కార్యకర్తలకు స్వాగతం పలికిన ఆయన, పాత-కొత్త అనే భేదం లేకుండా అందరూ కలిసికట్టుగా పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులైన కడమంచి రమేష్, రవి, పర్వతం భీములు, యాకయ్య, రాజు, అలాగే బీజేపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అనుముల రాజు, నరసయ్యతో పాటు దాదాపు 60 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

# ఆబాద్ లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



**వరంగల్ వాయిస్, జనగామ:** మండలంలోని పసరమడ్ల గ్రామం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ జనగామ ఆబాద్ తరపున నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. పాఠశాల ఆవరణలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ ఆబాద్ లయన్స్ క్లబ్ అందిస్తున్న సేవలను, ముఖ్యంగా విద్యార్థులను ప్రోత్సహించే కార్యక్రమాలను అభినందించారు. పూర్వ జిల్లా గవర్నర్ లయన్ కన్న పరశురాములు మాట్లాడుతూ విద్యార్థులు చదువు పట్ల శ్రద్ధ పెట్టి, విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్లబ్ కోశాధికారి సుదగాని ప్రవీణ్ ఈ గ్రామానికి చెందినవారు కావడం వల్ల, ఆయన కోరిక మేరకు ఈ పాఠశాలను ఈ సంవత్సరం దత్తత తీసుకుని పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని క్లబ్ అధ్యక్షుడు లయన్ కారంపూడి సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజన్ చైర్మన్ లయన్ రామిని శ్రీనివాసులు, జోన్ చైర్మన్ ఫజ్జురి లక్ష్మీనరసయ్య, ఫాస్ట్ రీజియన్ చైర్మన్ కె.రాజశేఖర్ రెడ్డి, క్లబ్ కార్యదర్శి పులుగం సురేష్, కోశాధికారి సుధగాని ప్రవీణ్, ఉపాధ్యాయులు సోమనర్సయ్య, శ్రీనివాసు, మాధవి, హేమలత తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి
- భారీ వర్షాలు, వినాయక చవితిపై సమీక్ష




**వరంగల్ వాయిస్, హనుమకొండ:** రాబోయే భారీ వర్షాలు, వినాయక చవితి వేడుకల నేపథ్యంలో నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (టీజీఎన్‌పీడీసీఎల్) సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం విద్యుత్ భవన్‌లో 16 సర్కిళ్ల సూపరింటెండింగ్ ఇంజనీర్లు (ఎస్ఈ), డివిజనల్ ఇంజనీర్లతో (డీఈ) ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాబోయే నాలుగు రోజులలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, ఎస్ఈలు, డీఈలు, ఇతర సిబ్బంది తప్పనిసరిగా హెడ్ క్వార్టర్‌లో అందుబాటులో ఉండాలని సీఎండీ ఆదేశించారు. వాగులు, వంకలు పొంగే ప్రాంతాలలో విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను నిరంతరం పర్యవేక్షిస్తూ, అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎక్కడైనా విద్యుత్ అంతరాయాలు ఏర్పడితే వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు సిబ్బంది, సామగ్రిని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. వినాయక మండపాల నమోదు ప్రక్రియను మొబైల్ యాప్‌లో పొందుపరచాలని సీఎండీ సూచించారు. ఎంత కిలోవాట్ లోడ్ వినియోగిస్తున్నారో కూడా నమోదు చేయాలని, దీనివల్ల ట్రాన్స్‌ఫార్మర్‌పై లోడ్ ఎంత ఉందో తెలుసుకోవచ్చని వివరించారు. గతేడాది దాదాపు 35,000 విగ్రహాలు నమోదయ్యాయని, ఈ ఏడాది 10 నుంచి 15 శాతం పెరిగే అవకాశం ఉందని అంచనా వేశారు. వినాయక మండపాల నిర్వాహకులకు విద్యుత్ భద్రత గురించి అవగాహన కల్పించాలని, భద్రత తెలిపే కరపత్రాలను పంపిణీ చేయాలని ఆదేశించారు. సంబంధిత లైన్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్, ఏఈల నెంబర్లను కూడా ఇవ్వాలని సూచించారు. నిమజ్జనం జరిగే చెరువులు, కుంటలను తప్పనిసరిగా పర్యవేక్షించి, అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నిర్వాహకులను వాట్సాప్ గ్రూపులలో చేర్చి, ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరవేయాలన్నారు. అత్యవసర పరిస్థితులలో 1912 నంబర్‌కు కాల్ చేయాలని మండపాల నిర్వాహకులకు తెలియజేయాలని చెప్పారు. ఎక్కువ ఎత్తు ఉన్న విగ్రహాల నిమజ్జన మార్గాలను క్షుణ్ణంగా పర్యవేక్షించాలని సీఎండీ ఆదేశించారు. అవసరమున్న చోట లైన్లలో స్పేసర్లు ఏర్పాటు చేయాలని, రోడ్డు క్రాసింగ్స్ వద్ద 11 మీటర్ల పోల్స్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ అంతరాయాలు లేకుండా చూసేందుకు నిబద్ధతతో పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ఆపరేషన్) టి. మధుసూదన్, సీఈలు సదర్ లాల్, అశోక్, వెంకట రమణ, జీఎం మల్లికార్జున్, 16 సర్కిళ్ల సూపరింటెండింగ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

# రైతులకు యూరియాను సకాలంలో అందించాలి

**వరంగల్ వాయిస్, పరకాల:** రైతులకు పంటకు సరిపడా యూరియా బస్తాలను సకాలంలో అందించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం పరకాలలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి బొచ్చు కళ్యాణ్ మాట్లాడుతూ.. పరకాలలోని ఫర్టిలైజర్ దుకాణాలు యూరియా బస్తాలను నిల్వ ఉంచి రైతులకు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఇతర పురుగుల మందులు కొనుగోలు చేస్తేనే యూరియా బస్తాలు అమ్ముతామని షాపుల యజమానులు రైతులను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని, దీనివల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యూరియా బస్తాలు ఇవ్వకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించినా, పరకాలలోని వ్యాపారులు దాన్ని ధిక్కరిస్తున్నారని కళ్యాణ్ విమర్శించారు. రైతులను మోసం చేస్తున్న ఫర్టిలైజర్ షాపులపై ప్రభుత్వం, అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు వ్యవసాయ అధికారికి ఫోన్ చేసి పిలిపించారు. పరకాలలోని ఒక ఫర్టిలైజర్ షాపులో యూరియా నిల్వ ఉన్నప్పటికీ, రైతులను ఇబ్బంది పెడుతున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన అధికారి, నిల్వ ఉన్న యూరియా బస్తాలను వెంటనే రైతులకు అందించాలని, లేదంటే చర్యలు తప్పవని షాపు యజమానులను హెచ్చరించారు.



# గొప్ప కమ్యూనిస్టు యోధుడు సురవరం



**వరంగల్ వాయిస్, ఖిలా వరంగల్:** గొప్ప కమ్యూనిస్టు యోధుడు, పాలకులను ధైర్యంగా నిలదీసిన ధీరుడు సురవరం సుధాకర్ రెడ్డి అని ఏఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్ అన్నారు. ఖిలా వరంగల్ మండల సమితి ఆధ్వర్యంలో శివనగర్ ఎస్సీ హాస్టల్‌లో జరిగిన కార్యక్రమంలో సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శరత్ మాట్లాడుతూ సురవరం సుధాకర్ రెడ్డి నైతిక విలువలకు కట్టుబడిన మహోన్నత వ్యక్తి అని పేర్కొన్నారు. మంచి కమ్యూనిస్టుగా, ఉత్తమ పార్లమెంటేరియన్‌గా ఆయన తన చివరి శ్వాస వరకు ప్రజల తరపున పోరాడారన్నారు. విద్యార్థి రాజకీయాల నుంచి తన ప్రస్థానాన్ని ప్రారంభించి ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా విద్యార్థులు, యువజనుల సమస్యలపై అనేక ఉద్యమాలు నడిపారన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)లో పనిచేస్తూ అత్యున్నత స్థాయిలో రెండుసార్లు జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై, రైతులు, కార్మికులు, పేద, మధ్య తరగతి ప్రజల సమస్యల పరిష్కారం కోసం దేశవ్యాప్తంగా సమరశీల పోరాటాలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించి అమలు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రేయస్, లడ్డు, వినయ్, రాకేష్, రమేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి

- ఏఐఎస్ బీ రాష్ట్ర కన్వీనర్ హకీమ్ నవీద్




**వరంగల్ వాయిస్, మంచిర్యాల:** మంచిర్యాల జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్ట్ హాలులో మంగళవారం ఏఐఎస్‌బీ (ఆల్ ఇండియా స్టూడెంట్స్ బ్లాక్) జిల్లా మొదటి మహాసభ జరిగింది. జిల్లా కార్యదర్శి కనుకుంట్ల సన్నీ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రాష్ట్ర కన్వీనర్ హకీమ్ నవీద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 19 నెలలు గడిచినా, ఎన్నికల్లో విద్యారంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఇప్పటికీ విద్యా శాఖ మంత్రిని నియమించకుండా కాలయాపన చేస్తూ విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రూ. 8 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉన్నప్పటికీ, ప్రభుత్వం నిధులు విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక ఆ హామీని విస్మరించి ఉమ్మడి జిల్లా విద్యార్థులకు తీరని అన్యాయం చేస్తున్నారని అన్నారు. వెంటనే ఉమ్మడి జిల్లాకు యూనివర్సిటీ ఏర్పాటుకు భూమిని కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా దగ్గేటి అరుణ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కనుకుంట్ల సన్ని గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులుగా జుమ్మిడి సుమంత్, కార్యదర్శిగా దీకొండ జతిన్ గౌడ్, కోశాధికారిగా రేగల్ల సిద్ధార్థ, కమిటీ సభ్యులుగా అతిక్, గణేష్, రావణ్, శ్రీనివాస్, సిద్ధార్థలు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రోహిత్, సాయి కిరణ్, సాయి రామ్ వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

# మట్టి గణపతులనే పూజిద్దాం

## ఎమ్మెల్యే నాయిని పిలుపు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా, హనుమకొండ ప్రజలకు పర్యావరణహితమైన మట్టి వినాయక విగ్రహాలను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ముందుగా హనుమకొండ జిల్లా ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ నవరాత్రి ఉత్సవాలు పర్యావరణహితంగా జరుపుకోవాలని కోరుతూ, తమ వంతుగా నగరంలో 30,000 మట్టి విగ్రహాలను ఉచితంగా అందిస్తున్నామన్నారు. వినాయక మండపాలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ సరఫరా చేస్తుందని కూడా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని, మట్టి గణపతులను



పూజించడంతో పాటుగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. వేడుకలకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా చూడాలని, నగరంలోని అన్ని వినాయక మండపాలను పర్యవేక్షించాలని అధికారులకు కచ్చితమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, భక్తులు పాల్గొన్నారు.

# మట్టి విగ్రహాల పంపిణీ



**వరంగల్ వాయిస్, వరంగల్:** వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం జరిగింది. దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావుల ఆదేశాల మేరకు టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్ 27వ డివిజన్‌లోని ప్రజలకు 1000 మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం శ్రీ కనకదుర్గ మాత దేవాలయం ఆవరణలో జరిగింది. ఈ సందర్భంగా మీసాల ప్రకాష్ మాట్లాడుతూ కొండా దంపతుల మార్గదర్శకత్వంలో ప్రతి డివిజన్‌కు సరిపడా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రజలందరూ మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షురాలు గూడ శారద, గూడ రమ్య, కాశ శ్రీదేవి, సింగిరికొండ ఉమారాణి, కాంగ్రెస్ నాయకులు జంగం ప్రభాకర్, కొంక వెంకటేశ్వరరావు, పప్పు వేణు, కొప్పుల చంద్రశేఖర్, రాజేందర్, శ్రీకాంత్, స్థానిక పెద్దలు సింగిరికొండ వెంకటేశ్వర్లు, వెలుమకాన్ని రాజారాం పాల్గొన్నారు.

# ముస్తాబవుతున్న గణపతి మండపాలు



**వరంగల్ వాయిస్, దామెర:** మండలంలో గణపతి నవరాత్రి ఉత్సవాలకు భారీగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. హనుమకొండ నుంచి ప్రత్యేకంగా తయారు చేయించిన వివిధ రకాల వినాయక విగ్రహాలను తెచ్చి, మండలంలోని గ్రామాలలో వివిధ అలంకరణలతో కూడిన మండపాలను నిర్వాహకులు సిద్ధం చేస్తున్నారు. భారీ సంఖ్యలో విగ్రహాలను ప్రతిష్టించి తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇందుకోసం ఇప్పటికే మండపాలు, అలంకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పీఓపీ విగ్రహాలతో పాటు, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ పెద్ద సంఖ్యలో మట్టి విగ్రహాలను కూడా తయారు చేస్తున్నారు. ముఖ్యంగా యువత ఈసారి మట్టి విగ్రహాల పట్ల ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు.

# పోచమ్మ మైదాన్‌లో మట్టి విగ్రహాల పంపిణీ



**వరంగల్ వాయిస్, వరంగల్:** వరంగల్‌లోని పోచమ్మ మైదాన్ సెంటర్‌లో శ్రీ బాలాజీ క్రియేషన్ అధినేత లయన్ డాక్టర్ ఆడెపు రవీందర్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 200 మట్టి వినాయక విగ్రహాలను భక్తులకు అందజేశారు. అనంతరం ఆడెపు రవీందర్ మాట్లాడుతూ "మట్టి వినాయకులను పూజిద్దాం, పర్యావరణాన్ని కాపాడుకుందాం" అనే నినాదంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆడెపు ప్రశాంత్, నంది శశి కుమార్, అంబాల రఘు, జక్కు రామకృష్ణ, బొమ్మగాని రాజు, అనపర్తి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# మాస్టర్ జీ లో వినాయక చవితి సెలబ్రేషన్స్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రెడ్డి కాలనీలో ఉన్న వికాస్ మాస్టర్ జీ పాఠశాలలో మంగళవారం వినాయక చవితి వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు, పద్యాలు, ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థిని శాన్విక పార్వతి వేషధారణలో, అక్షయ శివుడి వేషధారణలో, మరొక విద్యార్థి వినాయకుని వేషధారణలో తమ ప్రతిభను చాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాస్టర్ జీ విద్యాసంస్థల ఛైర్మన్, మాజీ కుడా ఛైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ పిల్లల ప్రతిభను ప్రశంసించారు. అనంతరం సుందర్ రాజ్ యాదవ్ మాట్లాడుతూ ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులలో భక్తి భావాన్ని, మన సంస్కృతిపై ఆసక్తిని పెంపొందిస్తాయని అన్నారు. కార్యక్రమం చివరలో వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాగి వాణి, ఏఓ నాగరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మట్టి విగ్రహాలతో పర్యావరణ పరిరక్షణ




**వరంగల్ వాయిస్, జనగామ :** వినాయక చవితి పండుగ సందర్భంగా మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ ప్రజలను కోరారు. రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలు జల జీవులకు హానికరమని ఆయన పేర్కొన్నారు. మంగళవారం జనగామలోని నెహ్రూ చౌక్ వద్ద మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ద్వారా సరఫరా అయిన మట్టి వినాయక విగ్రహాలను మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి సమక్షంలో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ భక్తులకు పంపిణీ చేశారు. మట్టి విగ్రహాలను పూజించడం ద్వారా సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జులైవాడ ప్రభుత్వ పాఠశాలలో..



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా, జులైవాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, వరంగల్ అందించిన ఈ విగ్రహాలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ రెడ్డి విద్యార్థులకు అందజేశారు.పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విశ్వజెనిత్ పాఠశాలలో..



**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** మండలంలోని విశ్వజెనిత్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ముందస్తు వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు దాదాపు 60కి పైగా మట్టి వినాయక విగ్రహాలను తయారు చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎర్రబెల్లి హరికుమార్ మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను కాకుండా, మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలనే పూజించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



**వరంగల్ వాయిస్, నర్సంపేట:** పర్యావరణానికి హాని కలిగించని మట్టి విగ్రహాలను పూజించి, పర్యావరణాన్ని కాపాడాలని నర్సంపేట మండలం మహేశ్వరం జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలల ప్రధానోపాధ్యాయురాలు స్వరూప కోరారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థులు మట్టితో వినాయక విగ్రహాలను తయారు చేశారు. ఈ సందర్భంగా స్వరూప మాట్లాడుతూ.. రసాయనాలతో తయారు చేసిన వినాయక విగ్రహాల వల్ల పర్యావరణం కలుషితమవుతుందని పేర్కొన్నారు. జీవ వైవిధ్యానికి నష్టం జరగకుండా ఉండేందుకు మట్టి విగ్రహాలనే పూజించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అర్జున్ సాగర్, వేణు బాబు, శ్రీలత, రాజేశ్వరి, రమేష్, రేఖ, కరుణాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

# మట్టి వినాయకులనే ప్రతిష్టిద్దాం

## శామంతుల శ్రీనివాస్ పిలుపు



**వరంగల్ వాయిస్, వరంగల్:** వినాయక చవితి పండుగ సందర్భంగా ప్రజలందరూ మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని వరంగల్ కాంగ్రెస్ లీగల్ సెల్ ఛైర్మన్ శామంతుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, కాలుష్య రహిత వాతావరణాన్ని భావితరాలకు అందించాలని ఆయన అన్నారు. నగరంలోని 34వ డివిజన్‌లోని శివనగర్‌లో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు చిట్టిమల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల ఉచిత పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శామంతుల శ్రీనివాస్ ఈ విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు చిట్టిమల్ల శ్రీనివాస్, మహిళా నాయకులు రావుల విజయరామచందర్, కొర్రపాటి రాధిక, కృష్ణకుమారి, రాజు, రమేష్, అశోక్, లక్ష్మి, అరుణ, పద్మ పాల్గొన్నారు.

# యూరియా అమ్మకాలు సజావుగా సాగాలి

## ◆ జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**వరంగల్ వాయిస్, తరిగొప్పుల:** జనగామ జిల్లాలో సాగుకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఇబ్బందులు పడకుండా పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఫర్టిలైజర్ షాపుల యజమానులను ఆదేశించారు. మంగళవారం ఆయన తరిగొప్పుల మండలంలో విస్తృతంగా పర్యటించి పలు చోట్ల తనిఖీలు చేశారు. ముందుగా కలెక్టర్ ఆగ్రోస్ సేవా కేంద్రాన్ని, పలు ఫర్టిలైజర్ షాపులను సందర్శించారు. స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించి, ఎంత మందికి, ఎన్ని బస్తాలు అమ్మారు, ఆయా రైతులకు ఎన్ని ఎకరాలు ఉన్నాయి వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎక్కువ రద్దీ లేకుండా చూసుకోవడానికి సరిపడా సిబ్బందిని పెట్టుకోవాలని, రైతులు ఎక్కువ సేపు వేచి ఉండకుండా అమ్మకాలు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం కేజీవీబీని సందర్శించి, మధ్యాహ్న భోజనానికి ఉపయోగించే వంట సరుకులు, పప్పు ధాన్యాలు, కూరగాయలను పరిశీలించారు. వంటకు వాడే ప్రతి వస్తువు తాజాగా ఉండాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన కలెక్టర్, లబ్ధిదారులతో మాట్లాడి ఇసుక, మొరం సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు ఎప్పటికప్పుడు సమావేశాలు పెట్టుకుని ఇసుక, మొరం, కంకర వంటి సామాగ్రి నిర్ణీత ధరలకే లబ్ధిదారులకు చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. చివరగా జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించిన కలెక్టర్, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి, వారి చదువు ఎలా సాగుతుంది, ఉదయం ఎన్ని గంటలకు నిద్ర లేస్తున్నారు, కష్టమైన సబ్జెక్టులు చదువుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి పరీక్షలు చాలా ముఖ్యమని, మంచి మార్కులు తెచ్చుకోవాలని సూచించారు. పరీక్షలు పూర్తయ్యే వరకు సమయాన్ని వృథా చేయకుండా ప్రతిరోజూ ప్రాక్టీస్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, విద్యా శాఖ అధికారులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకుల పంపిణీ

## కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** పర్యావరణ పరిరక్షణలో భాగంగా, దాస్యం ప్రణయ్ భాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, మౌనిక టూర్స్ అండ్ ట్రావెల్స్ ప్రతినిధి యుగేందర్ సహకారంతో మంగళవారం మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. వడ్డేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు, అలాగే ప్రణయ్ మార్గ్, సుబేదారి ప్రాంతాల్లో మొత్తం 800 మట్టి వినాయక విగ్రహాలను 60వ డివిజన్ కార్పొరేటర్ డా.దాస్యం అభినవ్ భాస్కర్, యుగేందర్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అభినవ్ భాస్కర్ మాట్లాడుతూ, రసాయనాలతో తయారు చేసిన వినాయక విగ్రహాలు నీటి కాలుష్యానికి కారణమవుతాయని, అందువల్ల పర్యావరణాన్ని కాపాడటానికి మట్టి వినాయకులను పూజించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 60వ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సతీష్, బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు యాదగిరి, జిల్లా ఓబీసీ సెల్ అధికార ప్రతినిధి అశోక్, డివిజన్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, బీజేపీ నాయకులు రామరాజు, నరేష్, శివ, రాజేష్, శ్రీకాంత్, అరవింద్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రమేష్, ట్రావెల్స్ అసోసియేషన్ సభ్యులు రమణ రెడ్డి, వంశీ, తిరుపతి, జెలెందర్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ కార్యకర్తల మీటింగ్



**వరంగల్ వాయిస్, పరకాల:** పరకాల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదేశాల మేరకు పరకాల మండలంలోని కామారెడ్డిపల్లి, అలియాబాద్, పోచారం గ్రామాలలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు చింతిరెడ్డి మధుసూదన్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ చిలువేరు మొగిలి, ప్యాక్స్ పరకాల సొసైటీ చైర్మన్ గుండెబోయిని నాగయ్య, గంట సమిరెడ్డి, ఆముదాలపెల్లి అశోక్, కోరే రమేష్, శితరాసి సనత్ కుమార్, ఎరుకొండ శ్రీనివాస్, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, ఇతర నాయకులు, కార్యకర్తలు, బీఆర్ఎస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ




**వరంగల్ వాయిస్, వరంగల్:** నగరంలోని పోచమ్మ మైదాన్, ఎల్.బీ.నగర్‌లో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు మంగళవారం నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. మాజీ విద్యార్థి, లయన్స్ క్లబ్ స్పోర్ట్స్ వరంగల్ వైస్ ప్రెసిడెంట్ లయన్ పోశాల సురేందర్ కుమార్తె డాక్టర్ గాయత్రి, న్యాయవాది బకరాజు భీమ్ పుట్టినరోజు సందర్భంగా మాసూం అలీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో దాదాపు 20 మొక్కలు నాటారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ బి.వి.ఎన్. స్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ లయన్ వంగరి వేణుగోపాల్, జోన్ చైర్‌పర్సన్ లయన్ రావుల రాజీవ్ భాను, క్లబ్ అధ్యక్షుడు లయన్ గుండేటి రమణయ్య, కార్యదర్శి లయన్ గౌరిశెట్టి ప్రవీణ్, ఉపాధ్యాయులు కనకయ్య, బిక్షపతి, కిషన్, దేవేందర్, మోహన్, శ్రీధరాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

# దాసు రఘురాం మృతి సమాజానికి తీరని లోటు



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ తండ్రి, రిటైర్డ్ సివిల్ ఎస్సై దాసు రఘురాం హనుమకొండలో గుండెపోటుతో మృతి చెందడంపై బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణ వార్త తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని, ఇది అత్యంత బాధాకరమని అన్నారు. ప్రజాహిత, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్న రఘురాం మరణం ఆయన కుటుంబానికే కాకుండా సామాజిక వర్గాలకు కూడా తీరని లోటని వెంకట్రాములు పేర్కొన్నారు. శోకసంద్రంలో ఉన్న దాసు సురేష్‌కు, వారి కుటుంబ సభ్యులందరికీ ఆయన తన సానుభూతిని తెలియజేశారు. నేటి యువతరం రఘురాంను ఆదర్శంగా తీసుకుని సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని వెంకట్రాములు అన్నారు.

# బాధిత కుటుంబాలకు పరామర్శ



**వరంగల్ వాయిస్, తొర్రూరు:** టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఝాన్సీ రాజేందర్ రెడ్డి మంగళవారం తొర్రూరు మండలంలోని పలు బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు.మొదటగా తొర్రూరు మండలం నాంచారిమాడురు గ్రామానికి చెందిన బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిధంగా అమర్సింగ్ తండా, హరిపిరాల గ్రామాలలోనూ పలు బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పొనుగోటి సోమేశ్వర్ రావు, మేకల కుమార్ యాదవ్, చెవిటి సదాకర్, సోమ రాజశేఖర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మట్టి గణపతి మేలు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** మండలంలోని విస్డం పాఠశాలలో ముందస్తు వినాయక చవితి వేడుకలను విద్యార్థులు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు 80 మట్టి గణపతి విగ్రహాలను తయారు చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం గురించి పాఠశాల ప్రిన్సిపాల్ అనుమాండ్ల దేవేందర్ మాట్లాడుతూ.. పర్యావరణం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించడానికి, వారిలో సృజనాత్మకతను పెంపొందించడానికి ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు సుధాకర్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు

## కాంగ్రెస్ నేత వొడితల ప్రణవ్

**వరంగల్ వాయిస్, హుజురాబాద్:** సకల విఘ్నాలను తొలగించే ఆదిదేవుడైన వినాయకుని పండుగ సందర్భంగా హుజురాబాద్ నియోజకవర్గ ప్రజలందరికీ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వొడితల ప్రణవ్ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. హుజురాబాద్ నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, పాడిపంటలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ భగవంతుడిని కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు. వినాయక మండపాలను నిర్వహించే నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రశాంతమైన వాతావరణంలో గణేష్ ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు. ఈసారి వినాయక మండపాలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందిస్తుందని ఆయన పేర్కొన్నారు.

# మట్టి వినాయకులతో పర్యావరణాన్ని కాపాడాలి

## ■ జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్




**వరంగల్ వాయిస్, ములుగు:** వినాయక చవితి పండుగ సందర్భంగా కృత్రిమ రంగులు, రసాయనాలతో తయారు చేసిన విగ్రహాల వల్ల జల వనరులు కాలుష్యానికి గురవుతున్నాయని, కాబట్టి భక్తులు మట్టి వినాయక విగ్రహాలను మాత్రమే పూజించాలని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కలెక్టర్ తన ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ సి.హెచ్. మహేందర్‌తో కలిసి మట్టి గణేష్ విగ్రహాలపై అవగాహన కల్పించే పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణానికి అనుకూలమైన మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకుని పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యత మన అందరిపై ఉందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 8 అంగుళాల మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా అందించి పర్యావరణంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. చెరువుల్లో పేరుకుపోయిన మట్టిని తొలగించడానికి, వాటి స్వచ్ఛతను కాపాడటానికి ప్రజలు, భక్తులు నడుం బిగించాలని కలెక్టర్ కోరారు. మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను పూజించి, చెరువులను కలుషితం కాకుండా కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, కాలుష్య నియంత్రణ మండలి ఏఈఎం సుభాష్ నాయక్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# చిత్ర నిర్మాణ రంగంలోకి జయం రవి




రవిమోహన్ స్టూడియోస్ నిర్మాణ సంస్థకు శ్రీకారం


ఒకవైపు మాజీ భార్య ఆర్తితో విడాకుల వివాదంతో వార్తల్లో నిలుస్తునే.. మరోవైపు తన కెరీర్‌లో కీలక ముందడుగు వేశాడు నటుడు జయం రవి (రవి మోహన్). తాజాగా ఈ నటుడు 'రవిమోహన్ స్టూడియోస్' పేరుతో సొంత నిర్మాణ సంస్థను ప్రారంభించాడు. చెన్నైలో ఈ వేడుక ఘనంగా జరుగగా.. ఈ ఈవెంట్‌కి రవి తన ప్రేయసి కెన్నిషాతో కలిసి వచ్చి ఘనంగా ప్రారంభించారు. ఇక ఈ వేడుకకు.. ముఖ్య అతిథులుగా కన్నడ స్టార్ శివరాజ్ కుమార్, తమిళ హీరోలు కార్తీతో పాటు–, శివకార్తికేయన్ సూర్య, అథర్వ, జెనీలియా, రితేష్ దేశ్‌ముఖ్, దర్శకురాలు సుధా కొంగరతో పాటు– పలువురు స్టార్ సెలబ్రీటిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా రవి మోహన్ స్టూడియోస్ బ్యానర్ లో నిర్మించబోయే తొలి రెండు సినిమాలను కూడా ప్రకటించారు. అందులో మొదటి సినిమాలో రవి మోహన్ హీరోగా కార్తీక్ యోగి దర్శకత్వంలో తెరకెక్కబోతుంది. సూర్య ఈ సినిమాలో కీలక పాత్ర పోషించనున్నాడు. ఇక రెండవ సినిమాలో హాస్య నటుడు యోగిబాబు లీడ్ లో రాబోతోంది. ఈ సినిమాను స్వయంగా రవి మోహన్ దర్శకత్వం వహించబోతున్నాడు.



# మిరాయ్ సినిమా మరో వారం వాయిదా

హనుమాన్ సినిమాతో ఫ్యాన్ ఇండియా క్రేజ్ సంపాదించుకున్న తేజా, ఇప్పుడు మిరాయ్ అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నాడు. కార్తీక్ ఘట్టమనేని డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై విశ్వప్రసాద్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. నిజానికి, ఈ సినిమా సెప్టెంబర్ 5వ తేదీన ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉంది, కానీ ఈ సినిమా ఒక వారం వాయిదా పడే అవకాశం ఉందని అంటున్నారు. ఇంకా అధికారిక సమాచారం రాలేదు, కానీ సెప్టెంబర్ 12వ తేదీన సినిమా రిలీజ్ చేయబోతున్నారు. ఈ విషయాన్ని 28వ తేదీన రిలీజ్ చేయబోతున్న ట్రైలర్‌తో పాటు– ప్రకటించనున్నారు. ఈ నేపథ్యంలో, ఈ సినిమా కంప్యూటర్ గ్రాఫిక్స్ అవుట్‌పుట్ సెప్టెంబర్ 1వ తేదీ నాటికి రెడీ అవుతుందని అంచనా వేసినప్పటికీ, ఒకవేళ వాటిలో ఏమైనా కరెక్షన్స్ చేయాల్సి వస్తే, అప్పటికప్పుడు చేసి 5వ తేదీ లోపు రిలీజ్ చేయడం కష్టం కాబట్టి, కాస్త సమయం తీసుకునేందుకు సెప్టెంబర్ 12వ తేదీన ఫిక్స్ చేసుకున్నట్లు సమాచారం.



# వెంకటేశ్, వీవీ వినాయక్ కాంబోలో మరో మూవీ



టాలీవుడ్ సీనియర్ హీరో వెంకటేష్, తన తదుపరి సినిమాల ఎంపికలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో వచ్చిన విజయాన్ని కొనసాగించాలని భావిస్తున్న వెంకీ, ఎంతో ఆలోచించి తన తదుపరి ప్రాజెక్ట్‌ను మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో చేస్తున్నాడు. వెంకటేష్ – త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందబోతున్న ఈ సినిమా పూజా కార్యక్రమాలతో ఇప్పటికే ప్రారంభమైంది. సెప్టెంబర్ నుంచి షూటింగ్ ప్రారంభం కానుందని సమాచారం. త్రివిక్రమ్ దర్శకత్వంలో వెంకీ చేస్తున్న తొలి సినిమా ఇదే కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. గతంలో వెంకటేష్‌తో 'లక్ష్మి' అనే బ్లాక్‌బస్టర్ సినిమాను తెరకెక్కించిన వి.వి. వినాయక్, మళ్లీ వెంకీ కోసం ఓ మాస్ ఎంటర్‌టైనర్ స్క్రిప్ట్ రాయిస్తున్నట్లు– సమాచారం. త్వరలోనే ఆయన వెంకటేష్‌ను కలవాలని, కథ చెప్పాలని చూస్తున్నట్లు– ఇండస్ట్రీ వర్గాల్లో టాక్. 2006లో వచ్చిన 'లక్ష్మి' చిత్రం వెంకటేష్ కెరీర్‌లో ఓ మైలురాయిగా నిలిచింది. అప్పట్లో వీరిద్దరి కాంబినేషన్ మరోసారి రిపీట్ కానుందని వార్తలు వచ్చినా, ఆ ప్రాజెక్ట్ ఆగిపోయింది. ఇప్పుడు 19 ఏళ్ల గ్యాప్ తర్వాత, మళ్లీ అదే కాంబినేషన్ తెరపైకి వస్తుందన్న వార్తలు అభిమానుల్లో ఆసక్తిని కలిగిస్తున్నాయి. పైగా ఇది కూడా మాస్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ జానర్‌లో ఉండనున్నట్టు– సమాచారం. 'ఇంటెలిజెంట్' వంటి సినిమా బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచిన తర్వాత వినాయక్ కొంతకాలం గ్యాప్ తీసుకున్నారు. హిందీలో 'ఛత్రపతి' రీమేక్ చేసినా, అది కూడా మిశ్రమ స్పందనే పొందింది. దాంతో కాస్త గ్యాప్ ఇచ్చాడు. ఇక ఇప్పుడు వెంకటేష్‌తో కాంబినేషన్ కుదిరితే, వినాయక్ తిరిగి హిట్ ట్రాక్‌లోకి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# యధావిధిగా 5న ఘాటీ

క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో అనుష్క, విక్రమ్ ప్రభు కీలక పాత్రల్లో నటిస్తున్న యాక్షన్ క్రైమ్ డ్రామా 'ఘాటీ–'. సెప్టెంబరు 5న ఈ మూవీ విడుదల కానుంది. ఇదే రోజున రావాల్సిన 'మిరాయ్' వాయిదా పడటం అనుష్క సినిమాకు కలిసొచ్చే అంశం. ఎక్కువ థియేటర్లు దొరికే అవకాశం ఉంది. అదే సమయంలో తమిళం నుంచి వస్తున్న శివకార్తికేయన్ 'మదరాశి' పైనా మంచి అంచనాలే ఉన్నాయి. ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. పవన్‌కల్యాణ్ కథానాయకుడి సుజీత్ దర్శకత్వంలో రూపొందుతున్న గ్యాంగ్‌స్టర్ డ్రామా 'ఓజీ'. డీవీవీ ఎంటర్–టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న ఈ మూవీని సెప్టెంబరు 25న విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈక్రమంలో సినిమా విడుదల వాయిదా పడే అవకాశం ఉందన్నారు. కానీ, 'సువ్వి.. సువ్వి' సాంగ్ ప్రకటిస్తూ విడుదల తేదీలో ఎలాంటి మార్పూ లేదని చిత్ర బృందం స్పష్టం చేసింది. ఇంకా నెల రోజులే సమయం ఉండటంతో వీలైనంత త్వరగా ప్రమోషన్స్ మొదలు పెట్టాలని పవన్ అభిమానులు కోరుతున్నారు. బాలకృష్ణ కథానాయకుడిగా నటిస్తున్న 'అఖండ2: తాండవం' కూడా సెప్టెంబరు 25నే విడుదల కావాల్సిఉంది. ఈ విషయాన్ని కూడా చిత్ర బృందం ప్రకటించింది.

# చైన్ స్నాచర్ అరెస్ట్

## వివరాలు తెలిపిన సీపీ సన్ ప్రీత్ సింగ్




**వరంగల్ వాయిస్, క్రైం :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో చైన్ స్నాచింగ్‌లతో పాటు ద్విచక్రవాహన చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని కెయూసీ, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా కలిసి అరెస్టు చేశారు. నింధితుడి నుంచి సూమారు రూ.23.50 లక్షల విలువ కలిగిన 237గ్రాముల బంగారు పుస్తెల తాళ్లు, గొలుసులు, మూడు ద్విచక్ర వాహనాలు, రూ.10 వేల నగదు, ఒక సెల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ అరెస్టుకు సంబందించి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ వివరాలను వెల్లడించారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం, దామెర ప్రాంతానికి చెందిన మంతుర్తి హరీష్ గత కొంత కాలంగా రెడ్డి కాలనీలో అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నాడు. డిగ్రీ వరకు చదివిన హరీష్ ఓ సిమెంట్ కంపెనీలో క్వాలిటీ టెక్నిషియన్‌గా హైదరాబాద్‌లో పనిచేసేవాడు. ఈ ఏడాది ఇదే సిమెంట్ కంపెనీలో ఇంజనీర్‌గా పనిచేస్తున్న సహోద్యోగి ఇంటిలో బంగారు గోలుసు చోరీకి పాల్పడి దానిని స్థానిక మణిప్పురం గోల్డ్ లోన్ కంపెనీలో తాకట్టు పెట్టగా వచ్చిన డబ్బుతో నిందితుడు జల్సాలు చేశాడు. ఈ సంఘటలో నిందితుడుని స్థానిక నెరెడ్‌మెట్ పోలీసులు ఈ ఏడాది అరెస్టు చేసిన జైలుకు తరలించారు. బెయిల్‌పై విడుదలైన నిందితుడిలో ఏలాంటి మార్పు రాకపోగా తన జల్సాలకు అవసరమైన డబ్బు కోసం చైన్ స్నాచింగ్‌లకు పాల్పడి వాటిని అమ్మగా వచ్చిన డబ్బుతో జల్సాలు చేద్దామనుకున్న నిందితుడు ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసి వెళ్ళి చైన్ స్నాచింగ్‌లకు పాల్పడేవాడు. ఇదే రీతిలో నిందితుడు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మొత్తం పది చైన్ స్నాచింగ్‌లు, మూడు ద్విచక్ర వాహన చోరీలకు పాల్పడ్డాడు. ఇందులో కెయూసీ పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు, రాయపర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు, సుబేదారి, కాజీపేట, హసన్‌పర్తి, కమలాపూర్, కరీంనగర్ జిల్లాలోని చిగురుమామిడి పోలీస్ స్టేషన్ల పరిధిలో ఒకటి చొప్పున చైన్ స్నాచింగ్ చోరీలకు పాల్పడ్డాడు. హనుమకొండ, హసన్‌పర్తి, సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పోలీస్ స్టేషన్ల పరిధిలో నిందితుడు మూడు ద్విచక్ర వాహన చోరీలకు పాల్పడటం జరిగింది.

వరుస చైన్ స్నాచింగ్ చోరీలపై అప్రమత్తమైన పోలీసులు క్రైమ్స్, హనుమకొండ ఏసీపీల అధ్వర్యంలో ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టారు. పోలీసులకు అందుబాటులో ఉన్న టెక్నాలజీని వినియోగించుకొని నిందితుడుని గుర్తించిన పోలీసులు పక్కా సమచారంతో ఈ రోజు ఉదయం యాదవ్‌నగర్ క్రాస్ రోడ్డు వద్ద అనుమానస్పదంగా కనిపించిన నిందితుడిని పోలీసులు పట్టుకొని తనిఖీ చేయగా బంగారు గొలుసు గుర్తించారు. పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా చైన్ స్నాచింగ్, ద్విచక్ర వాహన చోరీలను అంగీకరించాడు. నిందితుడు ఇచ్చిన సమాచారంతో అతను నివాసం ఉంటున్న అద్దె ఇంటి నుంచి పోలీసులు మిగితా చోరీ సోత్తును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడుని పట్టుకొవడంలో ప్రతిభ కబరిచిన పోలీస్ అధికారులను సీపీ అభినందించారు.

# పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించాలి

## ☐ శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వినాయక చవితి పర్వదినం సందర్భంగా వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య శుభాకాంక్షలు తెలిపారు. ఈ వినాయక చవితి ఆదిగా అభివృద్ధి సంక్షేమాలకు అన్ని విఘ్నాలూ తొలగి మనం అభివృద్ధి పథంలో ముందంజ వేయాలని ఆకాంక్షించారు. నిర్విఘ్నంగా అన్ని కార్యాలు నెరవేరాలని ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. అలాగే వినాయక మండపాల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీ సూచించారు. కరెంటు విషయంలో భద్రతా చర్యలు పాటించాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను పూజించాలని పిలుపునిచ్చారు. మట్టితో చేసిన వినాయకుడిని పూజిస్తే ముక్తి, పర్యావరణానికి శక్తి లభిస్తుందన్నారు.



# ఐక్య ఉద్యమాలతోనే బీసీ రాజ్యాధికారం

- ఇంటలెక్చువల్స్ ఫోరమ్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కూరపాటి రమేష్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వేల ఏండ్లుగా భారతదేశ సమాజ అభివృద్ధి కోసం బీపీ మండల్ స్ఫూర్తితో పోరాడి రాజకీయ రిజర్వేషన్లు సాధించాలని బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరమ్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కూరపాటి రమేష్ అన్నారు. బిందేశ్వర్ ప్రసాద్ మండల్ 107వ జయంతి సందర్భంగా సామాజికన్యాయం – రాజకీయ పార్టీలు అనే అంశంపై హనుమకొండ జిల్లా కేంద్రం హరిత కాకతీయ హోటల్ లో ఇంటలెక్చువల్స్ ఫోరం ఆధ్వర్యంలో మండల పరుశరాములు అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. స్వాతంత్ర ఉద్యమం మొదలు దేశంలో జరిగిన ఎన్నో ఉద్యమాల్లో బీసీలు పాల్గొన్నారని, ఐక్య ఉద్యమాల ద్వారానే తెలంగాణ సాధ్యమైందని, పార్టీలకు, కులాలకు, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా ఐక్య ఉద్యమాలు చేసిన నాడే బీసీలకు సామాజికన్యాయం జరుగుతుందని అన్నారు. బీసీ సమాజం నుంచి ఎదిగిన వారు బీసీ హక్కుల కోసం త్యాగపూరిత ఉద్యమాలు చేయాల్సిన అవసరముందన్నారు.

# డిగ్రీ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఏఐఎస్ఈసీటీ, జెన్ పాక్ట్ స్కిల్ బిల్ట్ కార్యక్రమం ద్వారా వరంగల్ డిగ్రీ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు జెన్ పాక్ట్ సీనియర్ మేనేజర్ గౌరి మహేంద్ర, ఏఐఎస్ఈసీటీ జోనల్ కోఆర్డినేటర్ శ్రీ విపుల్ శర్మ తెలిపారు. ఏఐఎస్ఈసీటీ గత రెండు దశాబ్దాలుగా గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లో డిజిటల్ లిటరసీ, నైపుణ్యాభివృద్ధి, విద్య, ఉపాధి సృష్టి రంగాలలో పనిచేస్తూ ఇప్పటివరకు ఆరు లక్షల మందికి పైగా యువత జీవితాలను మార్చిందన్నారు. సమర్థవంతమైన వ్యవస్థలతో, కార్పొరేట్ భాగస్వామ్యాల ద్వారా తుదిమైలు వరకు నైపుణ్యాలను చేరవేస్తూ, గ్రామీణ స్థాయిలో ఉన్న స్కిల్ గ్యాప్‌ను తగ్గిస్తోందన్నారు. ఏఐఎస్ఈసీటీ సంస్థ సిటీ మహిళా డిగ్రీ కాలేజ్, శివాని డిగ్రీ కాలేజ్‌లతో కలిసి ఎంఓయూ కుదుర్చుకుందన్నారు. ఈ భాగస్వామ్యంతో 250 మంది వెనుకబడిన విద్యార్థులకు బీఎఫ్ఎస్ఐ రంగంలో పరిశ్రమ ప్రమాణాల శిక్షణ అందించబడుతుందన్నారు. ఫైనాన్షియల్ అకౌంటింగ్, బ్యాంకింగ్, సాఫ్ట్ స్కిల్స్ శిక్షణతో పాటు, శిక్షణ అనంతరం ప్రత్యేక ప్లేస్‌మెంట్ సహాయం కల్పించబడుతుందన్నారు. దీంతో విద్యార్థులకు ఫైనాన్షియల్ ఆపరేషన్స్, కస్టమర్ సర్వీస్ (వాయిస్ & నాన్–వాయిస్) రంగాల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో శివాని డిగ్రీ కాలేజ్ డైరెక్టర్ డాక్టర్ వి.సురేష్, సిటీ మహిళా డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అమర జ్యోతి పాల్గొన్నారు.




# భూభారతి దరఖాస్తులకు పరిష్కారం చూపాలి

- హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్
- శాయంపేట తహసీల్దార్ కార్యాలయంలో పరిష్కార ప్రక్రియ పరిశీలన

**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని వివిధ గ్రామాలలో భూ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన భూభారతి దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా శాయంపేట మండల తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా భూభారతి దరఖాస్తుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను స్థానిక తహసిల్దార్ సత్యనారాయణ, ఇతర అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మండల వ్యాప్తంగా భూభారతి దరఖాస్తులు ఎన్ని వచ్చాయని, అందులో ఎన్నిటిని ఆమోదించారని, ఎన్ని దరఖాస్తులు తిరస్కరణ గురయ్యాయని ప్రశ్నించారు. తిరస్కరణ అయిన దరఖాస్తులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వచ్చిన దరఖాస్తులపై విచారణ చేయాలని, ఏయే ఆధారాలతో భూమిపై ఉన్నారనే వివరాలను విచారించాలన్నారు. భూభారతి దరఖాస్తుల పరిష్కార చర్యలను మరింత వేగవంతం చేయాలని, ప్రతిరోజు పురోగతి ఉండాలన్నారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బందితో మాట్లాడి వారు నిర్వర్తిస్తున్న విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసిల్దార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.




# పవిత్రమైనది మట్టి గణపతి

- ట్రాఫిక్ సీఐ కోడూరి సుజాత

**వరంగల్ వాయిస్, వరంగల్ :** పవిత్రమైనది మట్టి వినాయక ప్రతిమ అని, మట్టి గణపతిని పూజిస్తే ప్రకృతి దేవుని దీవెనలు పుష్కలంగా ఉంటాయని వరంగల్ ట్రాఫిక్ సీఐ కోడూరి సుజాత అన్నారు. శ్రీ వెంగమాంబ సేవాసమితి ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం బట్టల బజారులోని బాలానగర శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం ఎదురుగా మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ మట్టి గణపతులనే పూజించి పర్యావరణ పరిరక్షణకు దోహద పడాలని సూచించారు. ప్రతీ నెల పౌర్ణమి వేళ అన్నప్రసాద వితరణ చేస్తూ అన్నార్తుల ఆకలి తీర్చడమే కాకుండా పర్యావరణ హిత మట్టి వినాయకులను ఉచితంగా పంపిణీ చేసిన వెంగమాంబ సేవాసమితి నిర్వాహకులను సీఐ సుజాత అభినందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకుడు దివ్వెల పూర్ణచందర్, అంబికా దర్బార్ బత్తి డిస్ట్రిబ్యూటర్ యాద శ్రీనివాస్, సభ్యులు శాంతి ప్రియ, పద్మ, పృధ్వీ కృష్ణ, జ్యోతి, అశోక్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com